క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11కేవీ పురాణాపూల్ అండర్ గ్రౌండ్, సీతారాంపేట్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని నగర్‌ఖానా, జైన్‌మందిర్, ఓంవాడి, జుంగర్ బస్తీ, జాలి హనుమాన్, సేవాదళ్, సీతామాత, జుమ్మెరాత్ బజార్, నాంపల్లి దర్గా, గౌస్‌పురా, పటేల్‌నగర్, ఏక్‌మినార్ మసీద్, దారుస్సలాం, ఫటాఫట్ గల్లీ, సేవక్ నగర్, రెయిన్‌బో అపార్ట్‌మెంట్, దర్గాషామోక్ష్, సాయికృప అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కిషన్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని సర్వర్‌నగర్, గంజాషాహిదర్గా, మల్లైమెట్, లోక్‌క్షత్రియనగర్, బడీ మసీద్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

చార్మినార్: మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. దూద్‌బౌలి విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. ఖాజీపురా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అధునాతన పద్ధతుల్లో పాఠాలు బోధించాలి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, పరిశోధకులకు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఔట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ టీచింగ్ లెర్నింగ్ అనే అంశంపై రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. సీతారామారావు మాట్లాడుతూ, తక్కువ సమయంలో అధునాతన పద్ధతుల్లో విద్యార్థికి సమగ్రంగా అర్థమయ్యేలా పాఠాలు ఎలా బోధించాలి అనేది అధ్యాపకులకు నిరంతర అధ్యయనం, పరిశోధనల వల్లే సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఒక వైపు సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతుంటే మరోవైపు మూసపద్ధతుల్లో విద్యాబోధన సరైంది కాదన్నారు. నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా అధ్యాపకులు నైపుణ్యం సాధించాలని సూచించారు. పరిశోధన అంశాలను ఛాట్ జీపీటీ లాంటివి మరింత ప్రభావితం చూపనున్నాయని, తద్వారా పరిశోధనలపైనా అనుమానాలు రేకెత్తే అవకాశాలున్నాయన్నారు. ఇలాంటి సవాళ్లను ఎదుర్కోవడానికి అధ్యాపకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఓయూ వీసీ ఘెరావ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.రవీందర్‌ను పీహెచ్‌డీ అభ్యర్థులు ఘెరావ్ చేశారు. సోమవారం క్యాంపస్‌లోని ఠాగూర్ జరిగిన కార్యక్రమానికి హాజరై ఓయూలో పరిశోధనలకు పెద్దపీట వేస్తున్నామని మాట్లాడుతుండగా పీహెచ్‌డీ అభ్యర్థులు వీసీ ప్రసంగానికి అడ్డుతగిలి ఎంతమందికి పీహెచ్‌డీ సీట్లు ఇచ్చారని గొడవకు దిగారు. అప్రమత్తమైన పోలీసులు విద్యార్థులను సముదాయించి కూర్చొబెట్టారు. కార్యక్రమం ముగించుకొని బయటికి వెళ్తున్న వీసీని వెళ్లనివ్వకుండా అడ్డుకొని పీహెచ్‌డీ అర్హత మార్కుల తగ్గింపు విషయమై స్పష్టత ఇవ్వాలని నినాదాలు చేశారు. పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది సహకారంతో వీసీ వెళ్లిపోయారు.

పని చేయని వారిని పక్కన పెడదాం

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం పనిచేయని వారిని పక్కనపెట్టి పనిచేసే వారికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పీసీసీ వైస్ ప్రెసిడెంట్ మిట్టకంటి వినోద్‌రెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇంటింటికీ వెళ్తూ కాంగ్రెస్ పార్టీ విశిష్టతను చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం నియోజకవర్గంలోని ఆరు డివిజన్ల నాయకుల సమావేశాన్ని హిమాయత్‌నగర్‌లోని వినోద్‌రెడ్డి ఇంట్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అందరం ఏకతాటిపైకి వచ్చి ఒకేరీతిగా పనిచేస్తేనే పార్టీ గుర్తింపు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తుందన్నారు. కేవలం పార్టీ పదవులకు మాత్రమే పనిచేసే చిన్నా చితకా వారిని పక్కన పెట్టి పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు పదవులను ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతంలో నిర్వహించే హాత్ సే హాత్ యాత్ర విజయవంతానికి ఇప్పటి నుంచే కసరత్తు అవసరమన్నారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన

బంజారాహిల్స్: అగ్ని ప్రమాదం జరిగితే ఘటనా స్థలం నుంచి ఎలా బయటికి రావాలి, డీఆర్‌ఎఫ్ సిబ్బంది బాధితులను ఎలా బయటికి తీసుకొస్తారు అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. సోమవారం సోమాజిగూడ రాజ్‌భవన్ హైస్కూల్‌లో జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే దానిపై అవగాహన పెంచుకున్నారు. పై అంతస్తుల నుంచి బాధితులను కిందకు క్షేమంగా ఎలా తీసుకొస్తారో డీఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

సంక్షేమ పథకాలు పేదలకు వరం

ఎమ్మెల్యే కౌసర్


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

గోల్కొండ: అర్హత ఉన్న వారు సీఎంఆర్‌ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకుంటే మంజూరు అయ్యేలా చూస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు వరం లాంటివన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ శస్త్ర చికిత్స అవసరమైన వారికి సీఎంఆర్‌ఎఫ్ సంజీవని వంటిదన్నారు. దరఖాస్తు చేసుకునే వారు అన్ని రకాల ధ్రువీకరణపత్రాలు, ఆరోగ్య పరీక్షల రిపోర్టులు జత చేయాలని ఆయన సూచించారు.

టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తిరుపతి నామినేషన్


నామినేషన్ పత్రాలు అందజేస్తున్న తిరుపతి

సుల్తాన్‌బజార్: విద్యా రంగం, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానని 317 జీఓ బాధితుల తరపున నామినేషన్ వేసిన మాడిశెట్టి తిరుపతి అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాడిశెట్టి తిరుపతి సోమవారం హైదరాబాద్ మహానగర పాలక సంస్థ కార్యాలయంలో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 317 జీఓ ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు న్యాయం చేసేందుకే ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. తనను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

గౌలిపురా: మాఘ మాస సోమాపతి అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గౌలిపురా బతుకమ్మ బావి సమీపంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో సోమవారం పరమశివుడికి విశేష పూజలు, రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్ స్టేషన్ వద్ద భక్తులకు అన్నదానం చేశారు. సంఘం చైర్మన్ శ్రీరాం కోటయ్యగుప్తా, సలహాదారులు చీల రాములుగుప్తా, సరాబు విశ్వేశ్వరయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

రైతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి


ఎంపీ రాజు శెట్టితో ముజీబ్ హుస్సేని తదితరులు

అబిడ్స్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని మహారాష్ట్ర ఎంపీ రాజు శెట్టి పేర్కొన్నారు. నగరానికి వచ్చిన ఆయనను టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ రాజు శెట్టి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు తానూ పార్లమెంట్‌లో పోరాటం చేశానన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన పాలన అందిస్తుందని కొనియాడారు. ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ... ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజల కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, హన్మంతరావు, కిశోర్ దగ్గాలే, విక్రమ్‌కుమార్, మహ్మద్ వహీద్, ఉస్మాన్ అలీ, రామకృష్ణారెడ్డి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణకు పోరుబాట


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన సురేష్


గన్‌ఫౌండ్రీ: అమరుల త్యాగాలను వృథాగా పోనివ్వమని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాను సురేష్ అన్నారు. సోమవారం తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్యకు ఘనంగా నివాళులర్పించారు. బషీర్‌బాగ్ నుంచి గన్‌పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమరుల ఆకాంక్ష అయిన సామాజిక తెలంగాణ సాధించి తీరతామన్నారు. సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా రాజ్యాధికార పోరుబాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు ఉద్యోగులు, జర్నలిస్టులు, కళాకారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి కోర్ కమిటీ సభ్యులు డి.ఆనందం, చాపర్తి కుమార్, మంద వెంకటస్వామి పాల్గొన్నారు.

ఇంద్రజిత్ గుప్తా, గోవింద్ పన్సారే సేవలు చిరస్మరణీయం


హిమాయత్‌నగర్: దేశానికి మరచిపోలేని సేవలు, త్యాగాలు చేసిన భారతీయుల తరంలో చివరి వ్యక్తులు గొప్ప కమ్యూనిస్టు యోధులు ఇంద్రజిత్ గుప్తా, గోవింద్ పన్సారేలు అని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యిద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి కొనియాడారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఇంద్రజిత్ గుప్తా 22వ వర్ధంతి, గోవింద్ పన్సారే 8వ వర్ధంతి సందర్భంగా హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో సోమవారం వారి చిత్రపటాలకు సీపీఐ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ, పార్లమెంట్‌లో అత్యంత చురుకైన విమర్శకులలో ఇంద్రజిత్ గుప్తా ఒకరని, 'ఫాదర్ ఆఫ్ ది హౌస్' అని ఆయనను పిలిచేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఈటి. నరసింహ, పి. ప్రేమపావని, ఎస్. ఛాయాదేవి, కమతం యాదగిరి, బి.స్టాలిన్, నిర్లేకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, కలకొండ కాంతయ్య, లక్ష్మీ నారాయణ, ఆరుట్ల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహారంతోనే రోగ నిరోధక శక్తి

చార్మినార్: ప్రజలు తినే ఆహారం, జన్యువుల పరస్పరాగతంతోనే జన్యు మార్పులు ఏర్పడి స్థూలకాయానికి దారితీస్తుందని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషియన్ (ఎన్‌ఐఎన్) శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రావు అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాలభాస్కర్, రసాయనశాఖ అధిపతి డాక్టర్ ఏలూరి యాదయ్య ఆధ్వర్యంలో చేపట్టిన ఉపన్యాస కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థూలకాయంతో అంతర్గత అవయవాలు పనిచేయకపోవడంతో కేన్సర్, డయాబెటిస్ తదితర వ్యాధులకు దారితీసి మానవ మనుగడకు ముప్పుగా మారుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ్‌దత్ శుక్లా మాట్లాడుతూ.. పండ్లు తినడం, ఉత్సాహంగా ఉండడంతోనే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.దయానంద్, ఎ.వసంత, బుసి అనిల్‌కుమార్, శ్రీదేవి, డాక్టర్ భాస్కర్, డాక్టర్ పర్వతాలు, డాక్టర్ తిరుపతి, సి.విద్య తదితరులు పాల్గొన్నారు.


రాజేందర్‌రావును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ బాలభాస్కర్ తదితరులు

ఖాదర్‌ఖాన్ కుటుంబానికి న్యాయం చేయాలి



చార్మినార్: ఖాదర్ ఖాన్ విషయంలో మెదక్ జిల్లా పోలీసుల తీరు సరికాదని బీఎస్పీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎం.రాంచరణ్‌దాస్ అన్నారు. మెదక్ జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లో జరిగిన లాకప్‌డెత్‌కు గురైన ఖాదర్ ఖాన్ కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖాదర్ ఖాన్ లాకప్‌డెత్ ప్రభుత్వం చేసిన హత్యే అని, ఈ దుశ్చర్యకు పాల్పడిన అధికారులపై సస్పెన్షన్‌తో సరిపెట్టడం సరికాదన్నారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ధ్యాన, సంగీత మహోత్సవం


గీతాలు ఆలపిస్తున్న గాయకులు

అబిడ్స్: ట్యాంక్‌బండ్ గోశాల ఆడిటోరియంలో ధ్యాన, సంగీత మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గుడాకేశ గ్రాండ్ మాస్టర్ ప్రబోధ్ అచ్యుతచే ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. సంగీతరత్న పిప్పళ్ల ప్రసాద్‌చే సంగీత వాయిద్యం, కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎస్.సి శ్రీజచే పలు రకాల సంగీతాలు ఆలపించారు. భక్తులను ధ్యాన సంగీత మహోత్సవం విశేషంగా అలరించింది.

అన్నదానం


అన్నదానం చేస్తున్న పంకజ్‌కుమార్ అగర్వాల్

గోల్కొండ: పేదలకు కడుపు నిండా భోజనం పెట్టడం తనకు ఎంతో సంతృప్తినిస్తుందని టోలిచౌకి జానకి నగర్ కాలనీకి చెందిన సంఘ సేవకుడు సయ్యద్ మూసా అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం మెహిదీపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రోగులు, వారి సహాయకులకు భోజన ప్యాకెట్లు అందించారు. గోల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీరుద్దీన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద 341 రోజులుగా అన్నదానం చేస్తున్నామని, ఇందులో తనతో పాటు తన స్నేహితులు పాల్గొంటున్నట్లు సయ్యద్ మూసా తెలిపారు.

రికాబ్‌గంజ్‌లో..

చార్మినార్: అమావాస్యను పురస్కరించుకొని సోమవారం రికాబ్‌గంజ్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కుంభమేళా హైదరాబాద్ అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

చిన్నారుల్లో ఆధ్యాత్మిక విలువలు పెరగాలి


సర్టిఫికెట్ అందుకుంటున్న మహ్మద్ అర్సలాన్‌ఖాన్

గోల్కొండ: చిన్నారుల్లో ఆధ్యాత్మిక విలువలు పెంపొందించేలా చూడాల్సిన బాధ్యత వారి తల్లిదండ్రులపై ఉందని మదర్సా ఇస్‌హత్ ఉల్ ఖైర్ అధ్యక్షుడు మౌలానా అహ్మద్ అబ్దుల్లా తయ్యిబ్ అన్నారు. సోమవారం మజ్లిస్ కుతుబ్‌షాహీలో జల్సా అజ్మతే ఖురాన్ ఎ మజీద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకి, పారామౌంట్ కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన మదర్సాలలో ఖురాన్ కంఠస్థం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఖురాన్ గ్రంథ పఠనంలో పట్టా పొందిన వారిని హాఫిజ్ అంటారన్నారు. కార్యక్రమంలో మహ్మద్ షాహెద్, ముఫ్తీ సయ్యద్ మాసుబ్ తాహిర్, ముఫ్తీ కబీర్ అహ్మద్ పాల్గొన్నారు.

దుకాణంలో పనిచేసే వ్యక్తిపై యజమాని దాడి


యజమాని దాడిలో గాయపడిన గజానంద్

అబిడ్స్: దుకాణంలో పనిచేసే వ్యక్తిపై యజమాని తన అనుచరులతో కలిసి దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతడు షాహి నాయత్‌గంజ్ పోలీసులను ఆశ్రయించాడు. ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గోడేకబార్‌లోని అర్జున్‌కు చెందిన ప్లాస్టిక్ దుకాణంలో కాటేదాన్ బృందావన్ కాలనీకి చెందిన గజానంద్ (28) కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి అర్జున్ తన అనుచరులైన ముక్రమ్ చౌదరి, గురునాథ్, దిలీప్, ప్రవీణ్‌లతో కలిసి గజానంద్‌ను బలవంతంగా గోడేకబార్‌లోని తన షాపు వద్ద తీసుకెళ్లి దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు షాహినాయత్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ నివాసంపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

రాజేంద్రనగర్: ఢిల్లీలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నివాసంపై దాడికి పాల్పడిన వ్యక్తులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని రాజేంద్రనగర్ డివిజన్ మజ్లిస్ పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళిత, బీసీ, మైనార్టీలపై ఎక్కడ దాడులు జరిగినా మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నిస్తూ వారి పక్షాన నిలబడుతున్నారన్నారు. వారిలో మనోస్థైర్యాన్ని నింపేందుకు న్యాయపరంగా పోరాడుతున్నారన్నారు. దీనిని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. ఢిల్లీలోని ఆయన నివాసంపై దాడి చేసిన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు.

మజ్లిస్‌కు అన్ని వర్గాల ప్రజల ఆదరణ

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజల ఆదరణ లభిస్తోందని టోలిచౌకి డివిజన్ మజ్లిస్ నాయకుడు హారూన్ ఫరాన్ అన్నారు. సోమవారం టోలిచౌకి మేరాజ్ కాలనీలో వివిధ డివిజన్‌లకు చెందిన మజ్లిస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టోలిచౌకి డివిజన్‌ను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో ప్రతి ఏటా వరద ముంపు సమస్య ఉండేదని, కార్వాన్ ఎమ్మెల్యే చొరవతో సమస్య శాశ్వతంగా పరిష్కారమైందన్నారు. డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో అత్యాధునిక డ్రైనేజీలు, వరద నీటి పైప్‌లైన్‌లు వేసినట్లు తెలిపారు. శాతం చెరువులో పూడిక తీత పనులు పూర్తయినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు అజీజ్‌ఖాన్ పఠాన్, అలీమొద్దీన్, సయ్యద్ జబ్బార్, జావెద్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న మజ్లిస్ నాయకులు

శిథిలావస్థకు చేరిన కాలువ పైకప్పు

రాజేంద్రనగర్: నాలపైకప్పు శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకులు పెండ్యాల సాయిమాలిక్ గోతిని పరిశీలించి దీనిని పూడ్చాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ జలమండలి కార్యాలయ సమీపంలో గత కొంత కాలంగా మురుగునీటి కాలువ పైకప్పు శిథిలావస్థకు చేరుకుందన్నారు. ప్రధాన రహదారి పక్కనే ఈ గోతి ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులు, పాదచారులు తరచు గోతిలో పడి గాయపడుతున్నారన్నారు. రాత్రి వేళల్లో సమస్య మరింత తీవ్రంగా ఉందన్నారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.


ప్రమాదకరంగా మారిన గోతిని పరిశీలిస్తున్న పెండ్యాల సాయిమాలిక్

విజయగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు


యాగంలో పాల్గొన్న భక్తులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లోని విజయగణపతి దేవాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు ఉదయం అభిషేకం, అలంకరణ, శాంతి పాఠం, చతుర్వేద పారాయణం, మంటప దేవత పూజ, లఘురుద్ర మహాశత చండీ యాగ చండీ సప్తశతి విశేష సంకల్పం పారాయణం ప్రారంభం , రుద్ర శతచండీ యాగం, మహామంగళ హారతి, అన్నప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

నుమాయిష్‌కు దేశవ్యాప్త ఆదరణ: బండా ప్రకాశ్


ప్రకాశ్‌ముదిరాజ్‌ను సన్మానించిన ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు

అబిడ్స్: నుమాయిష్‌కు దేశంలోనే ఎంతో ఆదరణ ఉందని శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ పేర్కొన్నారు. శాసన మండలి వైస్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన ఆయనను ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు సోమవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయంతో తెలంగాణ నలుమూలలా విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. విద్యాసంస్థల అభివృద్ధికి ఎగ్జిబిషన్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీకి పూర్తి సహకారం అందిస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్విని మార్గం, కార్యదర్శి సాయినాథ్ శాస్త్రి, జాయింట్ సెక్రటరీ వనం సురేందర్, సభ్యులు వినయ్‌కుమార్‌ముదిరాజ్, రాజేందర్ కొరిడె, డి.మోహన్, సతీష్‌నాయక్ భాగ్యనారాయణ, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పదార్థాలను ఆస్పత్రికి తీసుకురావొద్దు


రోగి సహాయకురాలి వద్ద పట్టుబడిన కల్లు ప్యాకెట్


అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆస్పత్రిలోకి నిషేధిత పదార్థాలను తీసుకురావొద్దని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ అన్నారు. సోమవారం ఆస్పత్రిలోని పలు వార్డుల వద్ద సెక్యూరిటీ సిబ్బంది పని తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగుల సహాయకులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోపలికి అనుమతిస్తున్నామన్నారు. కొందరు సహాయకులు రోగుల కోసం పాన్, గుట్కా, జర్దా, సిగరెట్, బీడీ కట్టలతో పాటు కల్లు, మద్యం సైతం తీసుకువస్తున్నారని, దీని వల్ల రోగులకు ఇబ్బందులు కలుగుతున్నాయని చెప్పారు. ఆస్పత్రిలోకి ఎలాంటి మత్తు పదార్థాలు తీసుకురాకుండా సెక్యూరిటీ వ్యవస్థను పటిష్టం చేశామన్నారు. నిత్యం పెద్ద సంఖ్యలో గుట్కా, జర్దా, కల్లు, మద్యం వంటివి దొరుకుతున్నాయని, ఇలాంటి మత్తు పదార్థాలను ఆస్పత్రికి తీసుకురావద్దని ఆయన సూచించారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'

దూద్‌బౌలి: తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు పుష్పలీల అన్నారు. సోమవారం టీపీసీసీ కార్యదర్శి ముజీబుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్రలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఎనిమిదేళ్ల కుటుంబ పాలనతో ప్రజలు విసుగు చెందారని, ప్రజలు తిరిగి కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారన్నారు. పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేశ్‌బాబు, మహమూద్, కార్యకర్తలు పాల్గొన్నారు.


జోడో యాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి పుష్పలీల తదితరులు

టర్కీ భూకంప బాధితులకు ఔషధాలు



మందులు తీసుకెళ్తున్న వాహనానికి పచ్చజెండా ఊపుతున్న సోహెల్

గోల్కొండ: టర్కీ భూకంప బాధితులకు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని సకీనా ఫౌండేషన్ చైర్మన్ మహ్మద్ ఆసిఫ్ హుస్సేన్ సోహెల్ అన్నారు. టర్కీ భూకంప బాధితులకు సకీనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మందులు సేకరించారు. వాటిని సోమవారం నగరంలోని టర్కీ ప్రభుత్వ రాయబార కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయులు ఎప్పుడూ ప్రపంచంలో ఏం జరిగినా బాధితులకు అండగా ఉంటారన్నారు. సునామీలు, తుఫానులు, భూకంపాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు భారత ప్రభుత్వంతో పాటు భారతీయులంతా బాధితులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయల విలువ చేసే మందులను పంపిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సకీనా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.